క్లుప్తంగా

సర్పంచ్‌కు తెలియకుండా పింఛన్ల పంపిణీ

పెరవలి: తనకు కనీస సమాచారం ఇవ్వకుండా అన్నవరప్పాడు పంచాయతీ పరిధిలో కార్యదర్శి వెంకట్రావు పెంచిన పింఛన్లను పంపిణీ చేయించారని ఆ పంచాయతీ సర్పంచ్ పంతం బాల సుందరి ఆరోపించారు. తాను వైఎస్సార్ సీపీకి చెందినందునే పంచాయతీ కార్యదర్శి తనను పింఛన్ల పంపిణీకి ఆహ్వానించలేదని ఆమె అన్నారు. కార్యదర్శి వెంకట్రావుపై సర్పంచ్ మంగళవారం ఎంపీడీఓ హిమమహేశ్వరి, ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులిద్దరూ పంచాయతీ కార్యదర్శిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆమె విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది, తనను ఎవరేం చేస్తారనే నిర్లక్ష్యంతోనే కార్యదర్శి ప్రొటోకాల్ పాటించకుండా సర్పంచ్‌నైనా తనను నిర్లక్ష్యం చేశారని బాల సుందరి ఆరోపించారు. అన్నవరప్పాడు పంచాయతీ పాలకవర్గం చేసే తీర్మానాలను కూడా కార్యదర్శిగా వెంకట్రావు సక్రమంగా అమలు చేసేవారు కాదన్నారు. గ్రామస్తుల కోసం ఏపని చేద్దామన్నా అడ్డు తగిలే వారన్నారు. ప్రజల దాహార్తి తీర్చుదామంటే వద్దంటారని, పారిశుధ్య నిర్వహణకు ఆటో కొందామంటే అడ్డుపడుతున్నారని బాల సుందరి ఆరోపించారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన క్యాంపస్ ఇంటర్వ్యూలు



నియామక పత్రం అందుకుంటున్న ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల విద్యార్థిని

కొవ్వూరు: స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ విన్నాగ్ ఏ1 యాప్స్ అనే కంపెనీ మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ కళాశాల ఫైనలియర్ బీఎస్సీ, బీకాం విద్యార్థులు 58 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో డిస్కషన్, మౌఖిక పరీక్షల ఆధారంగా 12 మందిని ఎంపిక చేసినట్టు ఆ సంస్థ సీఈవో శేషు కొండపల్లి తెలిపారు. అలాగే సోమవారం అటివో సంస్థ ఇదే కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 16 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ ఎన్వీ సుబ్బారావు తెలిపారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి సూరిబాబు, అధ్యాపకుడు వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌రాజుకు సంఘ సభ్యుల సత్కారం



శ్రీధర్‌రాజును సత్కరిస్తున్న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ సభ్యులు

నల్లజర్ల: జిల్లా పరిషత్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తూ పదోన్నతిపై నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నియమితులైన ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజును నల్లజర్ల, గోపాలపురం సమితిలో పని చేస్తున్న సంఘ సభ్యులు మంగళవారం సత్కరించారు. సత్కరించిన వారిలో సంఘ కార్యదర్శి దివి పతంజలి, జిల్లా కౌన్సిలర్లు గంగుల శ్రీనివాసరావు, మడిచర్ల నాగేశ్వరరావు, ముళ్లపూడి నాగవెంకట సతీష్, సభ్యులు ఎస్వీ శ్రీనివాసరావు, డి.జానకీరామ్, ఎండీ అకిల్‌బాషా, ఎం.సులోచన, కె.రాజ్‌కుమార్, ఎస్‌కే భాదుషా, పి.జానకీదేవ్, బీడీకే రత్నం పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



పరిసరాల పరిశుభ్రతపై సమిశ్రగూడెంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ వ్యాపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి సమష్టి భాగస్వామ్యంతో డయేరియా వంటి వ్యాధులు నివారించగలమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎ.రాజమోహన్, పీహెచ్‌సీ సిబ్బంది పద్మ, హిమబిందు, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీలపై బంతాట..

- కూటమి నాయకుల్లో ఎవరిని కలవాలో తెలియక అధికారుల్లో అయోమయం
- తహసీల్దార్లు, ఎంపీడీవోలను వెనక్కి బదిలీ చేయని ప్రభుత్వం
- అనుకూలమైన వారి కోసం గ్రామస్థాయిలో కసరత్తు



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మండల పరిషత్ కార్యాలయం

నిడదవోలు రూరల్: మండల, గ్రామస్థాయి అధికారుల బదిలీలపై అనిశ్చిత నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అదిగో ఉత్తర్వులు.. ఇదిగో రిలీవ్‌లు అన్నట్టుగా చర్చోప చర్చలు సాగుతున్నాయి. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో మండల స్థాయి అధికారులుగా తమకు అనుకూలురను నియమించుకునేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. మరోపక్క పోస్టింగ్‌లు ఆశిస్తున్న అధికారులు తమను కలసి, తాము చెప్పినట్టు వింటేనే సిఫార్సు లేఖలు ఇస్తామని జనసేన నాయకులు చెబుతున్నారు. దీంతో బదిలీలు ఆశిస్తున్న అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలవాలో లేదా లోగడ రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావును కలవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్సైలు, మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తమ పోస్టింగుల కోసం ఆయా మండల, గ్రామస్థాయి నేతలు చుట్టూ తిరుగుతున్నారు. టీడీపీకి చెందిన నాయకులు బదిలీలు ఆశిస్తున్న అధికారులను తీసుకుని వేలివెన్నులోని శేషారావు ఇంటికి క్యూ కడుతున్నారు. మరికొందరు అధికారులు మాజీ నేతలను వెంటబెట్టుకుని వెళ్లి మంత్రి దుర్గేష్‌ను కలుస్తున్నారు. నియోజకవర్గంలో నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలో 56 గ్రామాలు ఉన్నాయి.

వెనక్కి పంపని ప్రభుత్వం

ఎన్నికల ముందు ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో పని చేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఎన్నికలు ముగిసిన తర్వాత వారిని తిరిగి సొంత జిల్లాలకు పంపాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. అయితే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈనెల 10వ తేదీ లోగా ఆయా తహసీల్దార్‌లను, ఎంపీడీఓలను తిరిగి సొంత జిల్లాలకు పంపుతారని ప్రచారం సాగుతోంది. నిడదవోలు ఎంపీడీఓగా పనిచేస్తున్న జేఏ ఝూన్సీ అనపర్తి నియోజకవర్గం నుంచి బదిలీపై రాగా ఆమె ఇక్కడే ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది టీడీపీ సర్పంచులు ఆమెను మాజీ ఎమ్మెల్యే శేషారావు వద్దకు తీసుకువెళ్లి ఇక్కడే కొనసాగించాలని కోరినట్టు సమాచారం. మరికొంత మంది మండల స్థాయి అధికారులు సైతం మంత్రి దుర్గేష్, శేషారావులను కలుస్తున్నారు. ఇంకొంత మంది అధికారుల ఆలోచన వేరేలా ఉంది. మంత్రి దుర్గేష్ జనసేన పార్టీ నాయకుడు. ఇక శేషారావు మాజీ ఎమ్మెల్యే. అంతేకాదు టీడీపీ క్యాడర్ అంతా ఆయనకే సపోర్టుగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందుముందు ప్రొటోకాల్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఎలాంటి అధికారిక పదవీ లేని శేషారావును ఒక్కోసారి అధికారిక కార్యక్రమాల్లో వేదికపై కూర్చోబెట్టాల్సి రావొచ్చు. అవి తమకు తలనొప్పి కారాదనే ఉద్దేశంతో కొందరు అధికారులు వేరే నియోజకవర్గాల్లోని వివిధ మండలాలకు వెళ్లే ఆలోచనలో ఉన్నారు. గ్రామస్థాయిలో అధికారులు మాత్రం మంచి స్థానాల కోసం తమకు అనుకూలంగా ఉండే ప్రజాప్రతినిధుల అనుగ్రహం కోసం ప్రయత్నిస్తున్నారు. అనుకూలంగా పని చేస్తామని, తమకు పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో కూటమి నేతలు సైతం వారి విన్నపాలపై ఆచితూచి స్పందిస్తున్నట్టు తెలుస్తోంది.

పాలనపై ప్రభావం

ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం అనుకున్న సమయంలో నిర్ణయం తీసుకోకపోవడంతో పాలనపై ఆ ప్రభావం పడుతోంది. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. అధికారులు సైతం తాము బదిలీలపై వెళ్తామని, వచ్చే వారితో పని చేయించుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఇదే సమయంలో కొత్త అధికారులు ఎప్పుడు వస్తారనేది తెలియకపోవడంతో అయోమయం నెలకొంది. మరోవైపు కూటమి నాయకులు, కార్యకర్తలు తమ పనుల కోసం ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



విద్యార్థినికి స్కూల్ కిట్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: ప్రభుత్వ విద్యాలయాల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వసతులను వినియోగించుకుని మంచి మార్కులతో ఉన్నత చదువులు చదవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్ నంబర్–3 లోని విద్యార్థులకు మంగళవారం యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ నేడు ప్రైవేట్ స్కూల్స్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు ఎంతో మెరుగ్గా ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా ఎన్నో సౌకర్యాలు అందిస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పాఠశాలల అభివృద్ధికి రూ.60 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షురాలు రాధారాణి, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రత్తి సువర్ణరాజు, కౌన్సిలర్ ఎండీ షకీరాబేగం, విద్యా గంటా సురేష్, ఎండీ ఫయాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మిక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నిడదవోలు: అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పామర్తి సత్య డిమాండ్ చేశారు. గౌతమి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం యూనియన్ నాయకుడు వెలిగట్ల శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిడదవోలులో నిర్వహించారు. సమావేశంలో పామర్తి సత్య మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమల ఏర్పాటు చేయకపోగా, ఏలూరులోని రెండు జూట్ మిల్లులు, చాగల్లు షుగర్స్ వంటి పరిశ్రమలు మూత పడ్డాయన్నారు. ఇలాంటి తరుణంలో అసంఘటిత రంగ కార్మికుల ఉపాధికి భద్రత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మల్లిడి వెంకట రామిరెడ్డి, మహ్మద్ ఆలీ, కిల్లాని గోపాల్, షేక్ హుస్సేన్, కోలాటాలు శ్రీనివాస్, రవి, బెజ్జంకి శ్రీనివాస్, చందిన రవికుమార్ పాల్గొన్నారు.

వైద్య సేవలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మద్దిపాటికి ఆమెన్ ట్రస్ట్ ప్రతినిధుల హామీ



ఎమ్మెల్యే వెంకట్రాజును కలసిన ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకులు

నల్లజర్ల: ప్రజారోగ్య సేవలో మండల ప్రజలకు తమ వంతు సాయం అందిస్తామని ఆమెన్ ట్రస్టు సభ్యులు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు హామీ ఇచ్చారు. ఆ ట్రస్టు సభ్యులు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావుతో కలసి మంగళవారం సాయంత్రం నల్లజర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టే ఆరోగ్య కార్యక్రమాలు అన్నింటిలోను తాము పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేస్తామని ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకుడు ఇవాంజలిన్ ఆశోక్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు ఈ సందర్భంగా ఆమెన్ ట్రస్టు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజలకు సేవలు అందించేందుకు ఆమెన్ ట్రస్ట్ వంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే మద్దిపాటి కోరారు. వారితో పాటు వైద్య, ఉద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్ కూడా ఉన్నారు.

నూతన వంగడాల నాట్లు పరిశీలించిన శాస్త్రవేత్తలు



వేగేశ్వరపురంలో వరి నాట్లను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

తాళ్లపూడి: ఖరీఫ్ సాగులో రైతులు అధిక దిగుబడులు పొందేందుకు కొత్త వరి వంగడాలను అందుబాటులోకి తెచ్చామని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహం తెలిపారు. మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో జరుగుతున్న ఖరీఫ్ వరి నాట్లను మంగళవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఈ ఖరీఫ్‌లో ఎంటీయూ 1271, 1275, 1310, బీపీటీ 3082, 2858 వంటి నూతన వరి వంగడాల విత్తనాలను ప్రయోగాత్మకంగా రైతులకు గత నెలలో పంపిణీ చేశారు. వాటిని నారు మడి దశ నుంచి నాట్లు వేసే దశ వరకూ పర్యవేక్షించే చర్యల్లో భాగంగా శాస్త్రవేత్తలు మంగళవారం ఈ క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నట్టు రైతుల తెలిపారు. ఈ ఖరీఫ్‌లో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉందని ఈ సందర్భంగా డాక్టర్ చల్లా వెంకటనరసింహం ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ హైమాజ్యోతి, ఏవో జి.రుచిత తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువకు మోక్షం



ముక్కామలలో డ్రైన్‌లోని పూడిక తొలగిస్తున్న పొక్లెయిన్

పెరవలి: ముక్కామల గ్రామంలోని ఉమ్మిడివారి పాలెం నుంచి చింతాలమ్మ చెర్వులో కలసే మురుగు కాలువ పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. ముక్కామల పంచాయతీ సర్పంచ్ కేతా త్రిమూర్తులు ఆదేశాల మేరకు పొక్లెయిన్ సాయంతో ఈ డ్రెయిన్‌లోని పూడికను తొలగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ డ్రెయిన్ పూడుకుపోవడంతో ఏటా వర్షాకాలంతో మిగులు జలాలు దిగువకు ప్రవహించక సుమారు 150 ఎకరాల్లోని పంటలు ముంపు బారిన పడుతున్నాయి. తమ పంట పొలాలు మునిగి పోతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేసేవారు. వారి విజ్ఞప్తి మేరకు సుమారు కిలో మీటరు పొడవైన ఈ డ్రైన్ పూడిక తీత పనులను సర్పంచ్ చేపట్టారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

వైద్యశిబిరం తొలగింపు

గోపాలపురం: డయేరియా నివారణకు గుడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తొలగించినట్టు హుకుంపేట పీహెచ్‌సీ డాక్టర్ బీవీవీ దుర్గా భవాని మంగళవారం తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంతో డయేరియా సోకిన రోగులందరూ పూర్తిగా కోలుకున్నారని ఆమె తెలిపారు. దాంతో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని తొలగించామన్నారు. గ్రామంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అయినప్పటికీ వారం రోజుల పాటు స్థానిక వైద్య సిబ్బంది గుడ్డిగూడెం గ్రామాన్ని పర్యవేక్షించనున్నట్టు డాక్టర్ దుర్గాభవాని తెలిపారు.

పైడిమెట్టలో తాటాకు పాక దగ్ధం



బాధిత కుటుంబానికి రేషన్ అందజేస్తున్న ఎంపీపీ పోసిరాజు తదితరులు

తాళ్లపూడి: ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని పైడిమెట్ట గ్రామంలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గ్రామానికి చెందిన దేవరపల్లి కిషోర్‌కు చెందిన తాటాకు పాక పూర్తిగా కాలిపోయింది.ఆ ఇంట్లో కిషోర్ కుటుంబం నివాసం ఉంటోంది. దీంతో ఫ్రిజ్, టీవీ, దుస్తులు, రెండు మంచాలు, సర్టిఫికెట్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబూరావు మంగళవారం కాలిపోయిన తాటాకు పాకను పరిశీలించారు. ఈ ప్రమాదంతో నిరాశ్రయులైన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో కొల్లి దుర్గారావు, కడవుల రజని, డి.చిరంజీవి, నందన ఫౌండేషన్ సభ్యులు రవి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందించిన మానవత సంస్థ

పైడిమెట్ట గ్రామంలో సోమవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అండగా నిలిచింది. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి మంగళవారం రూ.5 వేల విలువైన వంట పాత్రలు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, దోశయ్య, ఆంజనేయులు, బి. శంకర్, జె వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో క్లారినెట్ విద్వాంసుడికి సత్కారం



తాళ్లపూడిలో తుమ్మిడి తిరుమలరావును సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: స్థానిక మ్యూజికల్ బ్యాండ్ పార్టీలో పని చేసే క్లారినెట్ విద్వాంసుడు తుమ్మిడి తిరుమలరావును, ఆయన గురువులను మంగళవారం రాత్రి స్థానిక సొలస దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ముందుగా తాళ్లపూడిలోని బజార్ సెంటర్‌లో షేక్ లాల్ మ్యూజికల్ బ్యాండ్ ఆర్కెస్ట్రాతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గురుపూజ మహోత్సవంలో భాగంగా సువర్ణ క్లారినెట్ విద్యాంసుడు ర్యాలి సత్యనారాయణను సత్కరించారు. అనంతరం లక్ష్మీగణపతి మ్యూజికల్ (టీవీ భద్రం)పార్టీ సభ్యులు, శిష్య బృందం ఆధ్వర్యంలో తిరుమలరావును ఘనంగా సత్కరించారు. క్లారినెట్ అనుసుకు సువర్ణ కవచాన్ని తొడిగారు. కార్యక్రమంలో గురువులు నాగూర్ సాహెబ్, ర్యాలి సత్యనారాయణ, గోవూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, గోకవరపు సూరిబాబు, బాబులు, శిష్య బృందం పెరవలి సత్యనారాయణ, అన్నవరపు రాంబాబు, ర్యాలి శ్రీనివాసు, రామేశ్వరపు వంశీ, కడవ కొల్లురాజు తదితరుల పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

కొవ్వూరు: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ అనే నినాదంలో భాగంగా ప్రతి కార్యకర్తా పర్యావరణాన్ని కాపాడేందుకు ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ అన్నారు. స్థానిక గౌతమీనగర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం మొక్కలు నాటారు. వాయు కాలుష్య నియంత్రణకు మొక్కలు పెంచాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు సూచించారు. పర్యావరణాన్ని కాపాడడంతో పాటు ప్రాణవాయువు అందించే మొక్కల పెంపకాన్ని ప్రతి కార్యకర్తా బాధ్యతగా భావించాలని ఆ పార్టీ నియోజకవర్గ కో–కన్వీనర్ బీవీ ముత్యాలరావు కోరారు. గోపిశెట్టి శివకృష్ణ, గంద్రోతు పవన్ సోమరాజు, అసెంబ్లీ కన్వీనర్ మాట్లా ఆంజనేయులు, అడ్డూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరందుకుంటున్న వరి నాట్లు

- డెల్టా, మెట్ట ప్రాంతాల్లో ఏక కాలంలో ఊడ్పులు
- బెంగాలీల రాకతో తీరిన కూలీల కొరత



నల్లజర్లలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



పెరవలి మండలం ఉసులుమర్రులో వేసిన వరినాట్లు

నల్లజర్ల: వర్షాలు కురవడంతో మండలంలో ఖరీఫ్ సాగు పనులు జోరందుకున్నాయి. చాలా గ్రామాల్లో ముందస్తు వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో రైతులు వరినాట్లకు ఉపక్రమించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 10,877 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నారుమడులు పోయడం పూర్తయింది. బోర్ల సాయంతో ముందుగా నారుమడులు పోసిన అనంతపల్లి, చోడవరం, తెలికిచెర్ల, నల్లజర్ల, చీపురుగూడెం, పోతవరం, కవులూరు తదితర గ్రామాల్లో రైతులు నాట్లు వేయడం ప్రారంభించారు.

తీరిన కూలీల కొరత

కాలువల ద్వారా డెల్టా ప్రాంతానికి కూడా నీటిని విడుదల చేయడంతో ప్రస్తుతం అక్కడ కూడా ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాంతో డెల్టా ప్రాంత వ్యవసాయ కూలీలు ప్రస్తుతం అక్కడి పనులతో బిజీగా ఉన్నారు. గతంలో అయితే వారు నల్లజర్ల వంటి మెట్ట ప్రాంత మండలాలకు పనుల నిమిత్తం వలస వచ్చేవారు.ఈ ఏడాది డెల్టా, మెట్ట ప్రాంతాలు రెండుచోట్లా ఒకేసారి ఖరీఫ్ పనులు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడింది. ఈ తరుణంలో మండలానికి దాదాపు 28 బంటాల బెంగాలీ కూలీల వచ్చాయి. వారి రాకతో మెట్ట ప్రాంత రైతులకు కూలీల కొరత తీరింది. ఒక్కో బంటాలో 12 నుంచి 15 మంది వరకు కూలీలు ఉంటారు. వీరంతా కూడా పురుషులే. వారే మడిలోని నారు తీసి ఊడ్చేస్తారు. ఎకరానికి రూ.3,200 నుంచి రూ.3,600 తీసుకుంటున్నారు. మన ప్రాంత కూలీలైతే చదరపు మీటరుకు 44 వరి మూనలు నాటతారు. ఒక్కో కుదురుకు 5 మొక్కలు నాటతారు. అదే బెంగాలీ కూలీలు ఒక్కో కుదురుకు రెండే మొక్కలతో వరుసగా నాటతారు. చదరపు కిలోమీటరుకు 22 మూనలు పెడతారు. నాట్లకు నాట్లకు మధ్య వ్యత్యాసం ఉండడంతో వరిమొక్క త్వరగా బతికి వేళ్లానుకుంటుంది. గాలి, వెలుతురు, నీరుకు కొరత లేకుండా సమాంతరంగా మొక్క పెరుగుతుంది. ఈ తరహా ఊడ్పు వల్ల వరికి చీడపీడల బెడద కూడ తక్కువ.

80 శాతం శాతం 1121 సంపత్ స్వర్ణ

మండలంలో 80 శాతం మంది రైతులు సంపత్ స్వర్ణ రకం వరి వంగడాన్ని సాగు చేస్తున్నారని ఏవో కె.కమల్‌రాజ్ తెలిపారు. మిగిలిన 20 శాతం విస్తీర్ణంలో పీఎల్ 1100, బీపీటీ 5204, ఎంటీయూ, పీఆర్ 126 రకాలను సాగు చేసేందుకు రైతులు ఆకుమడులు పోసినట్టు వివరించారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఏవో చెప్పారు.

పెరవలి మండలంలో..

పెరవలి: కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది వరి నాట్లు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇప్పుడు వేగం పుంజుకున్నాయి. జూలై 15 నాటికి ఖరీఫ్ వరినాట్లు పూర్తయ్యేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులను తొందర పెట్టారు. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల జూన్‌లో నాట్లు వేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురవడానికి తోడు కాలువల ద్వారా నీరు రావడంతో రైతులు మురుగు దమ్ములు చేపట్టి నాట్లు వేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 8,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తారు. ఇప్పటి వరకూ 30 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు.